## ఓసీపీలో కొత్త హైడ్రాలిక్ క్రేన్ ప్రారంభం



నూతన క్రేన్ ముందు అధికారులు, ఉద్యోగులు, జీఎం

శ్రీరాంపూర్, మే 30 : శ్రీరాంపూర్ ఓసీపీవో యాజమాన్యం రూ. 5.26 కోట్లతో కొనుగోలు చేసిన హైడ్రాలిక్ క్రేన్‌ను శుక్రవారం జీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ ఓసీపీలో 75 టన్నుల సామర్థ్యం గల హైడ్రాలిక్ క్రేన్ ప్రారంభించామన్నారు. ఈ క్రేన్ వల్ల ఉపరితల గనిలో ఉన్న షావల్స్, డంపర్లు, సీహెచ్‌పీలోని యంత్రాలకు మరమ్మతులు చేయడం సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత్ సాహూ, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పీవో టీ శ్రీనివాస్, ఏజీఎం బీభత్స, ఐకే పీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, ఈఈ నాగరాజు, మేనేజర్ శ్రీనివాస్, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ మేన, నాయకులు చంద్రమోహన్, భద్రి బుచ్చయ్య, మోతె లచ్చన్న పాల్గొన్నారు.

## కొన్న వడ్లు వెంటనే మిల్లులకు తరలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కౌటాల, మే 30 : కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సాండ్‌గాం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు వడ్లు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్‌లు, గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సహకార సంఘం అధికారి బిక్క, తహసీల్దార్ ప్రమోద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎంఆర్‌ఐలు దిలీప్, దేవేందర్, నిర్వాహకులు, రైతులున్నారు.

- తమ్ముడిని బరిలో దింపేందుకు సిద్ధమైన మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్
- కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమ్‌రావును బలపరిచిన మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో తారాస్థాయికి వర్గవిభేదాలు

రెండు వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

# ఓరియంట్ ఎన్నికల కాక







మంచిర్యాల జిల్లా కాసిపేటలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ

మంచిర్యాల, మే30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రి పదవికోసం పట్టుబడుతుండగా, తాజాగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ తమ సన్నిహితులను బరిలో దింపేందుకు పోటీ పడడం చర్చనీయాంశమవుతున్నది. బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఒక్కటై కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమ్‌రావును బలపరుస్తుండగా, ఎమ్మెల్యే పీఎస్సార్ మాత్రం తన తమ్ముడు సత్యపాల్‌ను బరిలో దింపేందుకు ఆసక్తి చూపడం గందరగోళానికి దారితీస్తున్నది.

### మంత్రి పదవి కోసం పోటాపోటీ

జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నలుగురు నాయకుల మధ్య సఖ్యత లోపించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రిపదవి కోసం పట్టుబడుతుండగా, ఒకరంటే ఒకరికి పడటం లేదు. బహిరంగంగానే విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటుండగా, ఆ పార్టీ గందరగోళం నెలకొంటుంది. పార్టీ కోసం కష్టపడ్డానని.. తనకే గుర్తింపు ఇవ్వాలని, తనకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఇటీవల జరిగిన బహిరంగ సభలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుల సమక్షంలో మంచిర్యాల ఎమ్మెల్యే మాట్లాడారు. నిన్న..మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వొద్దని, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఎలా ఇస్తారంటూ.. కాకా కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అదే స్థాయిలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లు సైతం స్పందించారు. కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానిది విడదీయరాని అనుబంధమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ అంటే.. బీజేపీలో ఉంటే కేంద్రంలో పదవి వచ్చేదని, తనను కాంగ్రెస్‌లోకి సీఎం రేవంత్‌రెడ్డి రమ్మంటేనే వచ్చానని.. మంత్రి పదవిపై హామీ ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కౌంటర్ ఇచ్చారు. గతంలో జరిగిన ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును బహిర్గతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మంచిర్యాల ఎమ్మెల్యేల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి విషయంలో ముగ్గురు ఎమ్మెల్యేల మధ్య పోటీ నెలకొంది. రాష్ట్ర స్థాయి నుంచి మొదలుపెడితే కేంద్రస్థాయి దాకా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మంత్రి పదవి మాకే కావాలంటూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గాడి తప్పిపోయింది. ప్రతి విషయంలో ఎమ్మెల్యేలు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు పోటీ పడుతున్నారు. మొన్నటికి మొన్న ఎంపీ వంశీకృష్ణ వర్గాన్ని మంచిర్యాలలో నిరసన తెలపకుండా పీఎస్సార్ వర్గం నాయకులు అడ్డుకున్నారు.

### ఓరియంట్ ఎన్నికల కోసం పోటాపోటీ..

తాజాగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల కోసం గడ్డం వివేక్, వినోద్ ఒక్కటయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మాబొజ్జుతో కలిసి కాసిపేట మాజీ ఎంపీపీ విక్రమ్‌రావును బలపరుస్తున్నట్లు బెల్లంపల్లిలో శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రకటించారు. కాగా, ఇదే గుర్తింపు సంఘం ఎన్నికల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన తమ్ముడు సత్యపాల్‌రావును బరిలోకి దించనున్నారు. దీంతో మరోసారి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు బహిర్గతమైంది. కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సైతం ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. దీంతో ఒక్క కాంగ్రెస్ పార్టీ నుంచే మూడు వర్గాలు పోటీలో నిలవనుండడంతో ఏం జరుగుతుందో అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

### ఒక్కటైన ముగ్గురు.. ఒంటరైన పీఎస్సార్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిందే నలుగురు ఎమ్మెల్యేలు. అందులో ముగ్గురు మంచిర్యాల జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుంటే.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి వెడ్మా బొజ్జు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు ఎవరికి వారు తీవ్రప్రయత్నాలు చేస్తూ వర్గాలుగా విడిపోయారు. ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఈ నలుగురు ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారు. బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు వినోద్, వివేక్‌తో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జతకట్టారు. ముగ్గురు కలిసి ఓ అభ్యర్థిని బలపరిచారు. దీంతో పీఎస్సార్ ఒంటరైపోయారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. మంత్రి పదవి విషయంలోనూ బొజ్జు గడ్డం ఫ్యామిలీకే సపోర్ట్ చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఉన్న ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టాల్సి వస్తే నలుగురు ఎమ్మెల్యేలు కలిసి ఒకరిని నిలబెట్టాలి. అలా కాకుండా ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ వ్యక్తిని బలపరుస్తున్నట్లు ప్రకటించారు. డీసీసీ అధ్యక్షురాలిగా పీఎస్సార్ భార్య కొక్కిరాల సురేఖ ఉండగా.. ఆమెతో గానీ, మంచిర్యాల ఎమ్మెల్యేగానీ సంబంధం లేకుండా ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రకటన చేయడం హస్తం పార్టీలో కలకలం రేపుతున్నది. దీనిపై పీఎస్సార్ ఎలా స్పందిస్తారన్నది తీవ్రచర్చనీయాంశంగా మారింది.

### జూన్ 5న సమావేశం..

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై లేబర్ కమిషన్ కసరత్తు మొదలుపెట్టింది. ఈ నెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు అన్ని యూనియన్లతో సమావేశం కానున్నది. అన్ని యూనియన్ల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎన్నికల తేదీలను పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి కొన్ని నెలల క్రితమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. యాజమాన్యం మార్పు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేశారు. తాజాగా హైకోర్టు ఆదేశాలను లేబర్ కమిషన్ ఎన్నికలకు కసరత్తు మొదలుపెట్టింది. జూన్ 5న జరిగే మీటింగ్‌తో ఎన్నికలపై క్లారిటీ రానున్నది.




అన్ని ఏరియాల జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

## వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- సింగరేణి సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, మే 30 : సింగరేణి వ్యాప్తంగా జూన్ ఒకటి నుంచి చేపట్టబోయే వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సీఎండీ ఎన్‌బలరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని ఏరియాల డైరెక్టర్లు, జీఎంలు, అటవీ, పర్యావరణ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 675 హెక్టార్లలో 40 లక్షల మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఏరియాల వారీగా వన మహోత్సవ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని ప్రతి ఏరియాలో ఉత్సాహంగా నిర్వహించాలని, కార్మికులు, స్థానికులు పాల్గొనేలా చూడాలని సూచించారు. అలాగే 'నీటి బిందువు-జలసింధువు' కార్యక్రమంపైనా ఆయన సమీక్షించారు. సింగరేణి ప్రాంతంలో మొత్తం 62 మినీ చెరువులను తవ్వాలని నిర్ణయించగా, ఇందులో ఇప్పటికే 48 చెరువుల నిర్మాణం పూర్తికావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా మిగిలిన మినీ చెరువుల నిర్మాణం వారం లోగా పూర్తి చేయాలన్నారు. 43 చెరువుల్లో పూడికతీయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 25 చెరువుల్లో పనులు పూర్తయినట్లు ఏరియా అధికారులు వివరించారు. వీటిని పూర్తి చేయడం ద్వారా సింగరేణి ఆధ్వర్యంలో 105 నూతన చెరువుల నిర్మాణం, పూడికతీత చేసినట్లు అవుతుందని, ఇది అతి పెద్ద సామాజిక ప్రయోజన కార్యక్రమంగా నిలిచిపోతుందన్నారు. వర్షాకాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన చెరువుల్లో నీరు చేరేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పీపీ, పా కే వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని, సింగరేణి అటవీశాఖ సలహాదారులు మోహన్ పరిగేన్, జీఎం సీపీపీ మనోహర్, జీఎం(ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్రీ) సైదులు, వివిధ విభాగాల అధికారులు, ఏరియాల జనరల్ మేనేజర్లు, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



పంచాయితీల్లో ఆర్థిక పరమైన పనులు చేయలేమని ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న దహెగాం మండలంలో పంచాయితీల కార్యదర్శులు

- రెండేళ్లుగా జీపీలకు విడుదలకాని నిధులు!
- అప్పులు చేసి నెట్టుకొస్తున్న కార్యదర్శులు
- ఇకపై ఆర్థిక పరమైన పనులు చేయలేమంటూ చేతులెత్తేస్తున్న వైనం

# ఇక జీపీల భారాన్ని మోయలేం!

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రెండేళ్ల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు ఆర్థిక భారంతో అవస్థలు పడాల్సి వస్తున్నది. ఇంతకాలం అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టిన వారంతా.. ఇక ఆ భారం మోయలేమంటూ చేతులెత్తేయడం చర్చనీయాంశమవుతున్నది. అప్పులు చేసి ఆర్థిక పరమైన పనులు చేపట్టలేమంటూ ఇటీవల దహెగాం, కౌటాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ప్రకటించడం తెలిసిందే.

### నిధుల కోసం నిరీక్షణ

జిల్లాలో 334 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం 500 జనాభా కలిగిన చిన్న చిన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. సుమారు వందకు పైగా పంచాయితీల్లో ఏడాదికి రూ. 20 నుంచి రూ. 30 వేల వరకు పన్నుల రూపంలో సమకూరుతుండగా.. ఏమాత్రం సరిపోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సంఘం నిధులు, ప్రత్యేక నిధులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వాలు యేటా నాలుగు విడుతల్లో నిధులు విడుదల చేస్తాయి. ఈ మేరకు జిల్లాకు ప్రతి నెలా రూ. 8 కోట్ల నిధులు వచ్చేవి. ఈ నిధులు 2023 మార్చి నుంచి నిలిచిపోగా, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు 2023 నవంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. మెజార్టీ పంచాయతీల్లో నిధుల కొరతతో సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కూనరిల్లుతున్న జీపీలు

గ్రామ సచివాలయాలు నిధుల లేమితో కూనరిల్లుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడం.. చిన్న పంచాయతీల్లో పన్నుల రాబడి అంతంత మాత్రంగానే ఉండడంతో పాలనపై ప్రభావం పడుతున్నది. పాలకవర్గాల పదవీకాలం 2023 ఫిబ్రవరితో ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో గ్రామాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు, సిబ్బంది వేతనాలు, తదితరాలను సర్పంచులే చూసుకునేవారు. తర్వాత ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను పొందేవారు. ప్రస్తుతం అవన్నీ కార్యదర్శులకు భారంగా మారాయి. ఇక మరోవైపు కొందరు మాజీ సర్పంచులు తాము చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు విడుదల చేయాలంటూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### గాడితప్పుతున్న నిర్వహణ

వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తున్నది. దోమలు వృద్ధి చెంది పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదమున్నది. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంది. నీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలి. నిధులు లేక అనేకచోట్ల వీటి నిర్వహణ గాడితప్పుతున్నది. విద్యుత్ బిల్లులు, వీధి దీపాల ఏర్పాట్లు, ట్రాక్టర్ల నిర్వహణ, తాగునీటి పైపులైన్ మరమ్మతులు, నర్సరీల నిర్వహణ, వేతనాల చెల్లింపులు.. ఇలా ఏవీ చేయలేని పరిస్థితులు ఎదురవుతున్నట్లు కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. నిధులు లేక అత్యవసర సమయాల్లో కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేశాక తీసుకుంటామని భావించారు. కానీ, ప్రభుత్వం నుంచి నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో ఇక తాము పంచాయతీల ఆర్థిక భారాన్ని మోయలేమని చేతులెత్తేస్తున్నారు.



ఐనం గ్రామ పంచాయితీ కార్యాలయం

### రూ. 6 లక్షల అప్పు చేశాను



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు రెండేళ్లుగా నిధులు రావడం లేదు. దాదాపు రూ. 6 లక్షల వరకు అప్పు చేసి అభివృద్ధి పనుల కోసం ఖర్చుచేశాను. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అప్పులు చేసి పంచాయతీ ఆర్థిక అవసరాలు తీర్చడం సాధ్యం కాదు.

- చౌదరి రాజేశ్, ఐనం కార్యదర్శి, కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు

### అప్పులు చేసి నిర్వహించలేము..



దహెగాం గ్రామ పంచాయతీకి నిధులు రావడం లేదు. సుమారు రూ. 5 లక్షల వరకు అప్పు చేసి జీపీ అవసరాల కోసం ఖర్చుచేశాను. చిన్న చిన్న పనులు చేయడానికి సైతం ఇబ్బందులు పడుతున్నాం. ఇంకా అప్పులు చేసి ఖర్చుపెట్టే స్థితిలో లేము.

- ప్రణీత్, దహెగాం కార్యదర్శి, కార్యదర్శుల సంఘం మండల కార్యదర్శి



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తవ్వాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, మే 30 : కన్నెపల్లి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం టేకులపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనాతో పాటు గొల్లగట్టు, కన్నెపల్లి గ్రామాల్లోని చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్‌తో కలిసి పరిశీలించారు. టేకులపల్లిలో నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ తాగు నీరందించాలని సూచించారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. కొత్త రేషన్ కార్డుల కోసం అర్హుల జాబితా తయారు చేయాలన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల (ఏసీసీ), మే 30: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాలలోని తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ న్యాయపరమైన 10 డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, గజ్జెల్లి వెంకటయ్య, చెలిమెల అంజయ్య, వేముల అశోక్, అంకం సతీశ్ పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న బీసీ నాయకులు


